క్లుప్తంగా


మర్యాదపూర్వకంగా..



కాకాణితో నాయకులు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా పములు శంకరయ్యను నియమించినందుకు కృతజ్ఞతగా మంగళవారం మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకాణికి శాలువ కప్పి కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. పొదలకూరు మాజీ ఎంపీపీ కోనం చిన బ్రహ్మయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయ స్వామి

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భయపడొద్దు.. ఇబ్బందులుంటే చెప్పండి

- విద్యార్థినులకు డీఎస్పీ సూచన



విద్యార్థినులతో డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): విద్యార్థినులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని నగర డీఎస్పీ పి.సింధుప్రియ సూచించారు. సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెయింట్ జోసఫ్ బాలికల వసతిగృహంలో మంగళవారం మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర అంశాలపై డీఎస్పీ అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రక్షణ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులకు గురైతే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు మంచివి కావన్నారు. వారి మాయమాటలు, ప్రలోభాలకు గురికాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇంటా, బయట ఎలాంటి సమస్యలున్నా తల్లిదండ్రుల ద్వారా లేదా నేరుగా పోలీసులకు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని, వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. విపత్కర పరిస్థితుల్లో 112, 1098 ఫోన్ నంబర్లకు కాల్ చేస్తే తక్షణమే సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు, వసతిగృహ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్య తరగతి ప్రజల కోసం ఎంఐజీ లేఅవుట్లు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): తక్కువ ఖర్చుతో సొంతింటి కల నెరవేర్చేందుకు మధ్య తరగతి ప్రజల కోసం ఎంఐజీ లేఅవుట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు మంగళవారం కలెక్టరేట్‌లో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి నారాయణ సూచన మేరకు హైవేకు దగ్గరగా, నివాసాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. 8 నియోజకవర్గాల్లో నుడా విస్తరించి ఉందని ఆయా ప్రాంతాల్లో లేఅవుట్లను సిద్ధం చేయనున్నామన్నారు. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నుడా పరిధిలో అనేక అక్రమ లేఅవుట్‌లున్నాయని వాటిని త్వరలోనే తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ, జేసీ కార్తీక్, ఆర్డీఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

మూగజీవి మౌనరోదన

- అటెండర్లే వైద్యులు!
- పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉండని వైనం
- వేధిస్తున్న మందుల కొరత

పశు వైద్యం పాడి రైతులకు భారంగా మారింది. గత ప్రభుత్వంలో పాడి పశువులకు ఏదైనా అనారోగ్యం తలెత్తితే ఇంటి వద్దనే పశువులకు వైద్య సేవలు అందించేలా ప్రతి సచివాలయం పరిధిలో వెటర్నరీ పోస్టులను ఏర్పాటు చేసింది. మెరుగైన వైద్యసేవలకు ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు వీలుగా అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించింది. వైద్యులను, సిబ్బందిని నియమించి ఎక్కడా ఇబ్బంది రాకుండా చూసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పశు వైద్యసేవలు దుర్లభంగా మారాయి. పశు వైద్యులు సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో అటెండర్లే వైద్యులుగా సేవలందిస్తున్న పరిస్థితి నెలకొంది. ఆస్పత్రుల్లో ఖరీదైన మందులు కూడా అందుబాటులో లేని సమాచారం.



దూడకు సెలైన్ పెడుతున్న లైవ్ స్టాక్ అసిస్టెంట్

పొదలకూరు: కూటమి ప్రభుత్వంలో మూగజీవి మౌనంగా రోదిస్తోంది. సకాలంలో వైద్య సేవలు అందక, మందులు అందుబాటులో లేక విలవిలలాడుతున్నాయి. 'సాక్షి' మంగళవారం నిర్వహించిన పశు వైద్యశాలల్లో వైద్యసేవలపై నిర్వహించిన విజిట్‌లో చాలా విషయాలు బయటకు వచ్చాయి. పశు వైద్యశాలల్లో డాక్టర్లు ఉదయం నుంచి అందుబాటులో ఉండాల్సి ఉంది. పశువులు మేతకు వెళ్లే లోపే వాటికి వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. పశువైద్యశాలల్లో ఉదయం 9 గంటలకు కూడా పశు వైద్యులు హాజరు కాకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాలలో అటెండర్లే పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. పొదలకూరు ఏరియా పశు వైద్యశాల చుట్టు పక్కల గ్రామాలకు అందుబాటులో ఉంది. ఇక్కడకు దగ్గరలోని మండలాల గ్రామాల నుంచి కూడా పాడిరైతులు పశువులను తోలుకుని వస్తుంటారు. అయితే సహాయ సంచాలకులు (వైద్యాధికారి) ఉదయం 9.45 గంటలకు కూడా హాజరు కాలేదు. వైద్యశాలలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ రమేష్ పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. 9.30 గంటలకు సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ వైద్యశాలకు హాజరయ్యారు. నెల్లూరు రూరల్ మండలం ఉప్పుటూరుకు చెందిన పాడిరైతు ఆటోలో దూడకు బాగలేకుంటే ఆస్పత్రికి తీసుకు వచ్చాడు. దూడ నడవలేని స్థితిలో ఉండడంతో దానికి అటెండర్ సెలైన్ పెట్టి, ఇంజక్షన్ వేశారు.

పాడిసేవలు అంతంతమాత్రమే..

తోటపల్లిగూడూరు: మండలంలో పాడి రైతులకు అందుతున్న సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మండలంలో తోటపల్లిగూడూరు, కోడూరు, ఈదూరు గ్రామాల్లో పశువైద్య కేంద్రాలున్నాయి. వీటికి అనుబంధంగా చిన్నచెరుకూరు, పొట్లపూడి, సౌత్‌ఆములూరు గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇవి కాక ప్రతి రెండు పంచాయితీలకు రెండు చొప్పున ఏడు క్లస్టర్లు ఉన్నాయి. కాగా తోటపల్లిగూడూరు, ఈదూరు గ్రామాల్లోన్ని పశువైద్య కేంద్రాల్లో కాంపౌండర్లు లేకపోవడంతో అక్కడ వైద్య సేవలు అసంతృప్తిగా సాగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లోనూ పాడి రైతులకు సరైన వైద్య సేవలు అందక పాడి రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పలు చోట్ల అవసరమైన మందులు పంపిణీ చేయకపోవడంతో రైతులు అధిక మొత్తాలు హెచ్చించి బయట మార్కెట్లలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో పాడి పశువులకు పంపిణీ చేసే టీఎంఆర్ దాణా నిలిచిపోవడంతో పశుగ్రాసానికి రైతులు పాట్లు పడుతున్నారు.

దూడను కాపాడుకునేందుకు వచ్చాను



దూడకు నలతగా ఉంది. నడవ లేక పడిపోతోంది. ఏమయిందో తెలియడం లేదు. గ్రామంలో పశువైద్యశాల లేకపోవడంతో పొదలకూరుకు ఆటోలో దూడను తరలించుకు వచ్చాను. ఇక్కడ చూస్తే వైద్యాధికారి అందుబాటులో లేరు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ తన దూడకు వైద్య సేవలు అందించారు. వైద్యాధికారి పర్యవేక్షణలో వైద్యం అందించి ఉంటే బాగుండేది.

– పెంచలయ్య, పాడిరైతు, ఉప్పుటూరు

దయనీయ స్థితిలో..



కొడవలూరులో శ్మశానంలో ఉన్న పశువైద్యశాల

కొడవలూరు: కొడవలూరులోని పశువైద్యశాలలో పశు వైద్యాధికారి హర్షారెడ్డి మంగళవారం అందుబాటులో ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట లోపు సుమారు 20 మూగజీవాలకు వైద్య సేవలందించారు. కాగా ఈ వైద్యశాల భవనాన్ని శ్మశానంలో నిర్మించారు. శ్మశానాన్ని ఇప్పటికీ కొన్ని సామాజికవర్గాల వారు వినియోగిస్తుండడంతో మూగజీవాలకు వైద్య సేవలందించడంలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. అంత్యక్రియలతోపాటు కర్మక్రతువులు ఇక్కడే నిర్వహించే ఆనవాయితీ ఉంది. దీంతో గ్రామంలో ఆ సామాజికవర్గాలకు చెందిన వారు మృతిచెందితే రెండురోజులపాటు మూగజీవాలకు వైద్య సేవలందించడంలో తీవ్ర అసౌకర్యం నెలకొంటోంది. వర్షాకాలంలోనైతే ఈ భవనమంతా ఉరుస్తుండటంతో విధులు నిర్వహించడం ప్రహసనంగా మారుతోంది. పైగా భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగి ఉండటంతో పాములు తిరుగుతున్నాయి. వైద్యశాలలోకి వెళ్తున్నాయి. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వైద్యశాలకు భవన వసతి కల్పించాలని ఎన్నో పర్యాయాలు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రసన్న పరామర్శ



రాఘవరెడ్డిని పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రెడ్డిపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొటింరెడ్డి రాఘవరెడ్డి తల్లి వజ్రమ్మ అనారోగ్యతో సోమవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం వజ్రమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రసన్న వెంట ఆ పార్టీ బుచ్చిరెడ్డిపాళెం మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు బాల శంకర్‌రెడ్డి, మోర్ల భారత్, సర్పంచ్ పత్తి వెంకటరమణారెడ్డి ఉన్నారు.

లోకోస్ యాప్‌లో వివరాలు పొందుపరచాలి

పొదలకూరు: వీఓఏలు ప్రతి ఒక్కరూ లోకోస్ యాప్‌లో పొదుపు సభ్యులను నమోదు చేయాల్సిందిగా వెలుగు ఏపీఎం పీ చిన్నయ్య సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆర్థిక సంబంధమైన లావాదేవీలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సంఘబంధాల సభ్యులు ప్రతి ఒక్కరి వివరాలను యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. గతేడాది డిసెంబరు నెలాఖరు వరకు సభ్యుల పొదుపు వాటాధనం సభ్యత్వం, నిధులు, పొదుపు అంతర్గత అప్పులు, బ్యాంకు రుణాలు తదితర వివరాలను తప్పులు లేకుండా వీఓఏలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో సీసీలు పాల్గొన్నారు.

పుస్తకాలతో అనుబంధం పెంచుకోవాలి



పుస్తక మిత్ర గ్రంథాలయాన్ని ప్రారంభించిన అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: విద్యార్థి దశ నుంచే పుస్తకాలతో అనుబంధం పెంచుకుంటే జీవితం ఆనందంగా, ప్రశాంతంగా ఉంటుందని బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.శ్రీహరి అన్నారు. స్థానిక పెద్దూరు బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌ఆర్‌వి వాసవి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక మిత్ర గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలు చదవాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారులు ఎస్వీ నాయక్, పీవీ రత్నం మాట్లాడుతూ నిరంతరం పుస్తక పఠనం చేయడం వల్ల విజ్ఞానం, వికాసం, విచక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు ఏర్పడుతాయన్నారు. ఎస్‌ఆర్‌వి వాసవి అసోసియేషన్ సభ్యులను అభినందించారు. విద్యార్థుల చేత రోజూ ఒక గంటపాటు పుస్తకాలు చదువుతామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుజాత, జిల్లా రీసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న వైస్ ఎంపీపీ



ఫ్యాన్లు అందజేస్తున్న నారసింహారెడ్డి

కోవూరు: మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సూచనల మేరకు స్థానిక పచ్చిపాల రామనాథమ్మ బాలికోన్నత పాఠశాలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, కోవూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శివుని నారసింహారెడ్డి మంగళవారం పది ఫ్యాన్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో రూ.20 వేల విలువైన ఫ్యాన్లను విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, పడుగుపాడు మాజీ సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, పారిశ్రామికవేత్త సి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పక్కాగా నిర్వహించాలి



రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న నెల్లూరు ఆర్డీఓ అనూష

మనుబోలు: భూముల రీసర్వేను వివాదాలకు ఆస్కారం లేకుండా పక్కాగా నిర్వహించాలని నెల్లూరు ఆర్డీఓ నాగసంతోషి అనూష రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండలంలోని పిడూరులో జరుగుతున్న రీసర్వేను మంగళవారం ఆమె పరిశీలించారు. భూ రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రీసర్వే సమయంలో రైతులు తమ భూమికి సంబంధించిన వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. ఎక్కడైనా తప్పులు జరిగి ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చాలా చోట్ల రీసర్వేలో రైతులు భూమి తగ్గడం, ఒకరి సర్వే నంబర్ మరొకరికి పడడం లాంటివి చోటు చేసుకున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వీటిని సరిచేయడంతోపాటు ఇకపై ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రఘురాంరాజు, డీటీ మంజుల, సర్వేయర్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సర్పంచ్ వెంకటేశ్వరెడ్డి, ఆర్‌ఐ శ్రీకాంత్, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



ఇందుకూరుపేట: మాట్లాతున్న రఘునాథ్‌రెడ్డి



కొడవలూరు: యల్లాయపాళెంలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు, కొత్తూరు చింతోపు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారి రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పేరుతో ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెల సంఖ్యతో కూడిన కార్డులు జారీ చేస్తున్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది వీటిని ఇస్తారన్నారు. సొంత భూమి కలిగిన వారు ఈ రిజిస్ట్రేషన్ కార్డులకు అర్హులని చెప్పారు. దీని ద్వారా వివిధ పథకాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాధవయ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరు: భూమి కలిగిన ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని ఆత్మ పీడీ శివన్నారాయణ సూచించారు. మండలంలోని ఆలూరుపాడు, తలమంచి, యల్లాయపాళెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. యల్లాయపాళెంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పథకాలను విశిష్ట సంఖ్య ఆధారంగానే ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త విజయకుమార్, ఏఓ లక్ష్మి, ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏలు జి.ఉమామహేష్, ఎస్.ప్రసాద్, కేవీ పృథ్వీ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోవూరు: బుధ, గురువారాల్లో ఎస్‌బీఎస్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఈఈ కె.మధుసూదన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల్లో కోవూరు పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అత్యవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా గురువారం మండల పరిధిలోని గృహ వినియోగదారులకు సరఫరా ఇస్తామన్నారు. వ్యవసాయ వినియోగదారులకు త్రీ ఫేజ్ సప్లై రెండురోజులపాటు తెల్లవారుజామున ఉదయం 4 నుంచి 9 గంటలు వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

16న తిరుపతిలో వివాహ పరిచయ వేదిక

నెల్లూరు(బృందావనం): ఈనెల 16వ తేదీన తిరుపతి బైరాగిపట్టెడలోని వైఖానస కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక, రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగనుందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి అమానుషమని, అందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

'రంగడి'కి బంగారు గరుడసేవ ఉత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): మాఘ శుద్ధ పౌర్ణమి (వ్యాస పూర్ణిమ)ను పురస్కరించుకుని బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామికి తిరుమంజనం, సాయంత్రం 6.30 గంటలకు బంగారు గరుడసేవ ఉత్సవం నిర్వహిస్తామని ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకోవాలని కోరారు.

ఆస్తి కోసం వృద్ధ దంపతులపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఆస్తి పంచలేదన్న కోపంతో వృద్ధ దంపతులపై కోడలు, మనవరాలు దాడిచేసి గాయపరిచిన ఘటన జనార్దనరెడ్డికాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కాలనీకి చెందిన బలరామయ్య, ఆదిలక్ష్మమ్మలు దంపతులు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. చిన్నకుమారుడు రాఘవరెడ్డి నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి చిన్నకోడలు కృష్ణవేణి ఆస్తి కోసం బలరామయ్య, ఆదిలక్ష్మమ్మను ఇబ్బందులకు గురిచేయసాగింది. ఈనెల 8వ తేదీన కృష్ణవేణి తన కుమార్తెతో కలిసి బలరామయ్యపై దాడి చేస్తుండగా అడ్డుకోబోయిన ఆదిలక్ష్మమ్మపై సైతం దాడి చేశారు. ఈమేరకు ఆదిలక్ష్మమ్మ మంగళవారం రాత్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉదయకళేశ్వరుని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న పట్టాభిరామిరెడ్డి

కొడవలూరు: మండలంలోని గండవరంలో ఉన్న ఉదయకళేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. కాగా 26న శివరాత్రి, 28న జరిగే రథోత్సవాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ట్యాంకర్లు ఉంచుతామన్నారు. 28న ప్రముఖ గాయని మంగ్లీచే పాట కచేరి ఉంటుందన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈఓ బి.శాంతయ్య, సర్పంచ్ బి.రాజకుమారి అధికారులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- విద్యుత్ డీఈ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డీఈ సుబ్రహ్మణ్యం

పొదలకూరు : పీఎం సూర్యఘర్ సోలార్ ఎనర్జీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పొదలకూరు విద్యుత్ డీఈ పీ.సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వెలుగు సీసీలు, వీఓఏల సమావేశంలో డీఈ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రెండు కిలో వాట్స్ వరకు నూరు శాతం సబ్సిడీతో సోలార్ ఎనర్జీ ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. బీసీ, ఓసీ, ఇతరులకు ఒక కిలో వాటర్స్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్స్‌కు రూ.60 వేలు, మూడు కిలో వాట్స్‌కు రూ.78 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగంతో పాటు సబ్సిడీ పూర్తయిన తర్వాత మిగిలిన యూనిట్స్‌కు గ్రిడ్ ద్వారా ప్రభుత్వం వినియోగదారుడికి రావాల్సిన డబ్బులను వారి అకౌంట్‌లో జమ చేస్తుందన్నారు. సమావేశంలో వెలుగు ఏపీఎం చిన్నయ్య, ఏఈలు శ్రీకాంత్, సుజాత, కంపెనీ వెండర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కేసులే



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్సై వీరేంద్రబాబు

తోటపల్లిగూడూరు: ఆటోడ్రైవర్లు నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై వీరేంద్రబాబు హెచ్చరించారు. తోటపల్లిగూడూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వీరేంద్రబాబు మంగళవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రయాణంలో మహిళతో అనుచితంగా ప్రవర్తించడం, నరుకూరు, తోటపల్లిగూడూరు సెంటర్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇక ఇలా ప్రవర్తించే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోక తప్పదన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసే ఆటోడ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. జరిమానాలు విధించడంతో పాటు లైసెన్సులను రద్దు చేసేలా చూస్తామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నిర్మూలనే లక్ష్యం



గర్భిణుల మెడికల్ రిపోర్టులను పరిశీలిస్తున్న డాక్టర్ గేయ పూజిత

మనుబోలు: మాతా శిశు మరణాల నిర్మూలనే లక్ష్యమని పీహెచ్‌సీ డాక్టర్ గేయపూజిత అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్‌ఎంఏ) కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా రక్తహీనతతో బాధపడుతున్న వారిని, హైరిస్క్‌తో ఉన్న గర్భిణులను గుర్తించి వీరికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించుకునేందుకు గర్భిణులు ఎటువంటి సంకోచం పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్ రమణయ్య, స్టాఫ్ నర్స్‌లు ఆదిలక్ష్మి, అరుణమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.